నాడు దుర్గంధం నేడు ఆహ్లాదం..!



నాటి డంపింగ్ యార్డు (ఫైల్)



మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన థీమ్ పార్కులోని పచ్చదనం, పూల మొక్కలు



కంపుకొట్టిన ప్రదేశంలోనే సేదతీరనున్న ప్రజలు

2 ఎకరాల స్థలంలో రూ. 3 కోట్లతో పార్కు ఏర్పాటు

ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధమైన థీమ్ పార్క్

మల్లాపూర్: నాడు మల్లాపూర్ సంజీవయ్య డంపింగ్ యార్డును తొలగించాలని స్థానికులు పెద్ద సంఖ్యలో ధర్నాలు, రాస్తారోలు చేశారు. దుర్వాసన, దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ నాటి మల్లాపూర్ ప్రజలు నేడు అదే డంపింగ్ యార్డులో ఉదయం, సాయంత్రం ప్రజలు సేద తీరబోతున్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపాన 2 ఎకరాల స్థలంలో రూ.3 కోట్ల వ్యయంతో థీమ్‌పార్కును అందంగా అధికా రులు తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్కు పనులు తుది దశకు చేరుకోగా ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు థీమ్ పార్క్ ప్రారంభానికి సిద్ధమవుతోంది.

ప్రకృతి వనంలా అందంగా...

థీమ్ పార్కుని పచ్చని వనంగా తీర్చిదిద్ది చూపరులను ఆహ్లాదకరంగా ఉండేలా చేశారు. దీంతో మల్లాపూర్ డంపింగ్ యార్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చిన్నపిల్లలు, పెద్దలు కాసేపు సరదాగా ఆహ్లాదకరమైన వాతావారణలో గడపాలంటే పార్కులు తప్పనిసరి. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఈ పార్కులో ఆట వస్తువులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 95 శాతం పనులు పూర్తియ్యాయి. థీమ్ పా ర్కులో విశ్రాంతి తీసుకోవడానికి కూర్చునే బల్లలతో పాటు అందమైన గార్డెనింగ్, వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేశారు.

పార్కులో 50 రకాల పూల మొక్కలు

థీమ్ పార్కులో ఉద్యానవన శాఖ అధికారులు దాదాపు 50పైగా అరుదైన పూల మొక్కలతో పాటు మరెన్నీ ప్రత్యేకమైన చెట్లను ఈ థీమ్ పార్కులో ఏర్పాటు చేశారు.

నాడు ఎంతో కోట్లాడాం

డంపింగ్ యార్డును తొలగించాలని కోట్లాడాం, నేను కార్పొరేటర్ కాక ముందు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేశాం. జీహెచ్ఎంసీ అధికారులతో కోట్లాడి థీమ్ పార్కును మంజూరు చేయించుకున్నాం. పట్టణ ప్రాంతాల్లో ఉండే పిల్లల నుంచి పెద్దవాళ్లకు వ్యాయామం తప్పనిసారి. చిన్న వయస్సులోనే చాలా మందికి హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయి, మల్లాపూర్ ప్రజలకు ఆహ్లాదకరమైన పార్క్‌ను ఏర్పాటు చేయాలనే నా కల థీమ్ పార్కుతో నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మరో నెల రోజుల్లో పార్కును అందుబాటులోకి తీసుకువస్తాం

వినోదాన్ని పంచుతున్న 'కేఆర్‌సీ' ఎగ్జిబిషన్

30 వరకు నగరవాసులకు అందుబాటులో



ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్న చిన్నారులు

బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సి ఎగ్జిబిషన్ ఈనెల 30వ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో స్థానిక ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతుందన్నారు. ప్రతి రోజూ సాయంత్రం చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా ఇక్కడ వచ్చి సందడి చేస్తున్నారు. నగర శివారు ప్రాంతంలో నిత్యం బిజీగా ఉండే ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఆనందాన్ని పంచుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్, ఎర్రకోట ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోంది. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. జ్యూవెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్ మహిళలు, యువతుల మనస్సులను దోచుకుంటున్నాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగే కేఆర్‌సి ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి సేద తీరుతున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

కేసీఆర్‌ను కలిసిన ఉద్యమనేత వెంకన్న



కేసీఆర్‌తో ఉద్యమనేత వెంకన్న, రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్‌ను మల్కాజిగిరికి చెందిన ఉద్యమకారుడు అప్పటి జెఏసీ నాయకుడు వెంకన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పార్టీని అప్రతిష్ట పాలు చేసే ప్రయత్నాలకు భయపడవద్దని, ప్రజాసమస్యలపై ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేయాలని కెసీఆర్ సూచించారన్నారు.

శుభాకాంక్షలు...

మౌలాలి: జలమండలి మేనేజర్ అశోక్ నూతనంగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు మోహన్ యాదవ్, మల్కాజిగిరి న్యూఫోరం ఫర్ బెటర్ మల్కాజ్‌గిరి ఉపాధ్యక్షులు రాకేష్, కిరణ్, శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



జలమండలి జీఎం అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపు తున్న మోహన్‌యాదవ్ తదితరులు

అభాగ్యులను ఆదుకుంటే దేవుడిని ఆరాధించినట్లే

పిల్లల అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్చి బిషప్ పూలా అంథోని



సెంటర్‌ను ప్రారంభిస్తున్న అంథోని తదితరులు

రామంతాపూర్: సమాజంలోని బలహీన వర్గాలు, దివ్యాంగులు ఇతర ఏ ఆసరా లేని అభాగ్యుల పట్ల దయా, కరుణ చూపి ఆదుకోవడమే మానవత్వమని వారికి నిస్వార్థంగా సేవలు అందిస్తే దేవునిడి ఆరాధించినట్లేనని హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల అంథోని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వికలాంగుల హక్కుల కోసం పోరాడిన హెలెన్ కెల్లర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రామంతాపూర్‌లోని మౌంట్ ఫోర్టు నిలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల పిల్లల అభివృద్ధి కేంద్రాన్ని ఆయన వికార్ జనరల్ రెవరెండ్ బ్రదర్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగ, మానసికంగా అభివృద్ధి చెందని పిల్లలకు అన్ని రకాల థెరఫీలు ఉచితంగా అందిస్తూ వారి అభివృద్ధికి ఎనలేని సేవలు చేస్తున్న హెలెన్ కెల్లర్ సంస్థ పనితీరు సర్వత్రా ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పిల్లలు వికలాంగులు, వృద్ధులు సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ, హెలెన్ కెల్లర్ సంస్థ చైర్మన్ ఉమర్‌ఖాన్, రెవరెండ్ బ్రదర్ షైన్ అలెక్స్, తెలంగాణ ప్రభుత్వ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌తోపాటు మౌంట్ ఫోర్టు ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు

మౌలాలి: సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. జమలండలి అధికారులతో గురువారం మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తే అధికారులు వెంటనే స్పందించాలని ఆమె సూచించారు. డ్రైనేజీ పనులకు సంబంధించిన ఎన్నిసార్లు విన్నవించినా మంజూరు కావడం లేదని, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసిన పనులకు నిధులు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, లీకేజీలను అరికట్టాలన్నారు. వర్షంకాలం ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ శ్రీనివాస్, డ్రైనేజీ ఇన్‌చార్జి శివ, లైన్‌మెన్లు సోమయ్య, ఐలయ్య, అవినాష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: అల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం అల్వాల్ మండల తహసీల్దార్‌ని కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్వాల్‌కు చెందిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రకాశ్‌నగర్ వల్లభ్‌నగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లకు చెందిన భూములను రిజిస్ట్రేషన్ల కోసం అక్కడి వరకు వెళ్లాల్సి వస్తుందని, దీంతో స్థల కొనుగోలు, విక్రయదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టికి పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేయూత...

ఉప్పల్: మెడిసన్‌లో సీటు సంపాదించి ఫీజు కోసం విద్యార్థి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఫీజుకు సంబంధించి రూ.60 వేలను మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన గోపి శెట్టి చెన్న కేశవులు కుమారుడు శశికుమార్‌కు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు వచ్చింది. కానీ కళాశాలలో చేరాలంటే ఫీజు కట్టే స్థోమత లేకపోవడంతో విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లడంతో అదే విషయాన్ని ప్రవీణ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆర్థిక సహాయాన్ని అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గౌతంనగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ కె.వీణ అన్నారు. సాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా టైలరింగ్ కోర్సు, మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సాయిబాబా కల్యాణ మండపంలో సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వారు సర్టిఫికెట్లు అందచేసినట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం నాయకులు

అల్వాల్: కాచిగూడకు చెందిన మైనర్ బాలికను అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం ఆధ్వర్యంలో గురువారం నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజుల క్రితం కాచిగూడలో నివసిస్తున్న నిరుపేద రజక వృత్తిదారుల కుటుంబానికి చెందిన మైనర్ బాలిక తండ్రి మరణించి తల్లి మాత్రమే ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ కాచిగూడలో నివాసముంటున్నారన్నారు. 14 ఏళ్ల మైనర్ బాలికను కొంతమంది మాయమాటలు చెప్పి నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. దుండగులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు, నరేష్, గ్రేటర్ హైదరాబాద్ సిటీ ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, రజక వృత్తిదారుల సంఘం నాయకులు జ్యోతి ఉపేందర్, సుభద్రమ్మ, వెంకట్‌స్వామి, గోపాల్, రమేష్, వెంకన్న, శంకరయ్య, కుమారస్వామి, లక్ష్మీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

రామంతాపూర్: యాదవ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పింజర్ల రఘు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అల్లాడి రాము యాదవ్, కార్యదర్శిగా సర్వ ఆనంద్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్‌గా చట్టబోయిన సురేష్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్‌గా చట్టబోయిన సురేష్ యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

మల్కాజిగిరి: బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 29 శనివారం సాయంత్రం 6 గంటలకు ఆనంద్‌బాగ్‌లోని బిఆర్ బ్యాంకెట్ హాల్‌లో జరుగుతుందని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సంఘం ఉపాధ్యక్షుడు పండ్రంగి రామక్రిష్ణ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుము మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అభినందనలు



అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర సేవా పథకం అందుకున్న అల్వాల్ ఎస్.హెచ్.ఓ (ఇన్‌స్పెక్టర్) రాహుల్‌దేవ్‌ను గురువారం బీజేపీ నాయకులు కలసి అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలను అందిస్తున్నందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అందజేయడం హర్షనీయమని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, మల్లికార్జున్‌గౌడ్, రామ్మోహన్ గౌడ్, వినయ్ శంకర్, లక్ష్మణ్, కరుణశ్రీ, ఉదయ్ ప్రకాష్, అనురాధ తదితరులు ఉన్నారు.

ఎండిఎంఎ పట్టివేత... ముగ్గురు అరెస్ట్

మల్కాజిగిరి: నిషేధిత మత్తు పదార్థాలు అయిన ఎండిఎంఎ సరఫరా చేస్తున్న ముగ్గురిని మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ... మల్కాజిగిరి అనుటెక్స్ వద్ద విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మత్తు పదార్థం ఉన్న ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, మెట్టుగూడకు చెందిన సెబాస్టియన్ ఆంథోని, పీవీఎన్ కాలనీకి చెందిన రాకేష్‌కుమార్, భాను ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ విజయశాంతి

మల్కాజిగిరి/అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు మల్కాజిగిరి , అల్వాల్ సర్కిల్ల పరిధిలో స్థలాలు కేటాయించడమే కాకుండా నేరెడ్‌మెట్‌లోని మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మల్కాజిగిరికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. మల్కాజిగిరిలో అద్దె భవనంలో నడుస్తున్న లైబ్రరీకి ఏదైనా ప్రభుత్వ భవనంలోకి మార్చడం లేదా నూతన భవన నిర్మాణం, అల్వాల్‌లోని పాత లైబ్రరీ స్థానంలో నూతనంగా నిర్మించాలని కోరామన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలో ఎంఎంటీస్ ఫేస్2లో భాగంగా ఇండ్లు నష్టపోయిన వారికి డబుల్ బెడ్‌రూములు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకొని వచ్చామన్నారు. ఆల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బేగంపేట నుంచి అల్వాల్‌కు మార్చడం, నాచారంలోని మల్కాజిగిరి ఫైర్ స్టేషన్‌ను మల్కాజిగిరికి మార్చడానికి చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. తుర్కపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జికి భూసేకరణ సమస్య పరిష్కరించాలని, వాజుపేయినగర్‌లోని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల సమస్యలు, శ్మశానవాటికల సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. నియోజకవర్గం పరిధిలోని చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో అల్వాల్ కార్పొరేటర్ విజయశాంతి, నాయకులు జగదీశ్‌గౌడ్, వెంకన్న, అనిల్‌కిషోర్, రాముయాదవ్, ఉపేందర్‌రెడ్డి, జికె హనుమంతరావు, డోలి రమేష్ తదితరులు ఉన్నారు.

ఘన స్వాగతం




నూతన బస్సుకు స్వాగతం పలుకుతున్న ప్రయాణికుల సంఘం ప్రతినిధులు

గౌతంనగర్: సికింద్రాబాద్ రేతిఫైల్ బస్‌స్టాప్ నుంచి తుకారాం గేట్, హనుమాన్‌పేట్, ఉత్తమ్ నగర్, ఆనంద్‌బాగ్, సాయినాథపురం మీదుగా ఈసీఐఎల్‌కు గురువారం కొత్తగా ప్రారంభమైన 38 టి/16సీఆర్ ఆర్టీసి బస్సుకు సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెల్లర్స్ అసోషియేషన్ సభ్యులు హనుమాన్‌పేట్‌లో ఘన స్వాగతం పలికారు. బస్సు డ్రైవర్ శ్రీనివాస్, కండక్టర్ కవితకు అసోషియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూర్, ఏవి. స్వామిలు మాట్లాడుతూ ఇదే రూట్‌లో నేరెడ్‌మెట్ క్రాస్‌రోడ్డు వరకు 38ఈ, 16 ఎస్ బస్సును వేస్తే నేరెడ్‌మెట్ ప్రాంతంలోని న్యాయస్థానంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రయాణికులు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ డిపో మేనేజర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు బదలాయింపు

- ఒక వీధిలో చేయాల్సిన పనులు పక్కవీధిలో
- సాక్షి కథనంతో వెలికి వచ్చిన వాస్తవాలు
- ఇందిరానగర్‌ను సందర్శించిన వాటర్‌వర్క్స్ డీజీఎం
- మేనేజర్ వేణుగోపాల్‌ను మందలించి వివరణ కోరిన డీజీఎం సతీష్

సాక్షి ఎఫెక్ట్...



సమస్యను పరిశీలిస్తున్న డీజీఎం సతీష్

కుషాయిగూడ: ఓ వీధిలో చేయాల్సిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పక్క వీధిలో చేయించి అధికారులు స్వామి భక్తిని చాటుకున్నారు. ఎవరి మెప్పు కోసమో తెలియదు కానీ.. పైప్‌లైన్ వేయాల్సిన వీధిలో రోడ్డు తవ్వకాలు చేపట్టి పక్క వీధిలో పనులు చేసి చేతులు దులుపుకున్న అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. రోడ్డు తవ్వకాలు చేసి సుమారు మూడు నెలలు కావస్తున్నా తవ్వేసిన రోడ్డుకు కనీసం మరమ్మతులు అయిన చేయాలన్న విజ్ఞత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆ వీధి ప్రజలు మూడు నెలలుగా మొరపెట్టుకుంటున్న కనికరం లేకుండా వ్యవహరించిన అధికారులు తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఇందిరానగర్‌వాసుల మూడు నెలల మురుగునీటి కష్టాలపై మరమ్మతులపై పట్టింపేది.? అంటూ 'సాక్షి'లో ప్రచురించిన కథనంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఇందిరానగర్‌లో మురుగు సమస్యను పరిశీలించిన డీజీఎం

సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వారట్‌వర్క్స్ డీజీఎం సతీష్ గురువారం ఇందిరానగర్ కాలనీలోని మురుగు సమస్యను పరిశీలించారు. పనుల ఆలస్యంపై సంబంధిత వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్‌ను ప్రశ్నించారు. జరిగిన విషయం డీజీఎంకు తెలపడంతో మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఎలా బదాలిస్తారంటు మందలించి వివరణ కోరారు. అధికారుల తప్పిదంపై స్థానికులు నిలదీశారు. దీంతో అధికారులు ఆగమేఘాల మీద డ్రైనేజీ సమస్యకు మరమ్మతులు చేయించి తాత్కాలికంగా పరిష్కారం చూపారు. ఈ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం కొత్తగా ప్రతిపాదనలు చేసి రెండు వారాల్లో పనులు పూర్తి అయ్యేలా చూస్తామని అధికారులు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా స్థానికుల మాత్రం అధికారుల పట్ల ఆగ్రహంగా ఉన్నారు. మా వీధిలో చేయాల్సిన డ్రైనేజీ పైప్‌లైన్ పక్క వీధిలో ఎలా చేస్తారంటు ప్రశ్నిస్తున్నారు. బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విప్ జారీ చేశారు. ఈనెల 29వ తేదీన బోడప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్‌లపై అవిశ్వాస తీర్మానం జరగనున్నది. ఈ మేరకు విప్ ఆదేశాలను జారీ చేస్తూ తమ పార్టీ కార్పొరేటర్లకు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు తమ పార్టీ తరఫున విప్ జారీ చేసే ఆదేశాలను మల్లారెడ్డికి ఇవ్వాలంటూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. దీంతో కలెక్టర్ బీఆర్ఎస్ పార్టీకి విప్ ఆదేశాలను జారీ అధికారం మల్లారెడ్డికి కేటాయించారు. విప్ ఆదేశాలను ధిక్కరించి వేరే పార్టీకి ఓటేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మల్లారెడ్డి వెల్లడించారు.

ఉచితంగా హోమియో వైద్య సేవలు అందిస్తాం



జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

రామంతాపూర్: పొట్టి శ్రీరాములు హోమియోపతి మెడికల్ కళాశాల తెలంగాణ హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంటి న్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా గురువారం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ప్రముఖ సంఘ సంస్కర్త దేహిమినాబాయి దాగే జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి సంఘ ఆధ్వర్యంలో హోమియోపతి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య విద్యార్థులకు ప్రముఖులచే ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రొఫెసర్ లింగరాజు, డాక్టర్ పి.రజనీ చందర్, జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ జి.దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

రామంతాపూర్: ఎన్నో సంవత్సరాలుగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని డ్రైన్ నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌నగర్ వీధి నెంబర్‌వన్ నుంచి పది వరకు కోటి 50 లక్షల రూపాయల నిధులతో నిర్వహిస్తున్న బాక్సు డ్రైన్ పనులను బండారు శ్రీవాణి వెంకటరావుతోపాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు వరద నీరుతో ఎన్నో సంవత్సరాలుగా రోడ్ల మీద వర్షపు నీరు నిలుస్తుండేదని ఈ బాక్సు డ్రైన్ నిర్మాణం వల్ల ఆ సమస్య పోతుందన్నారు.

సెల్ టవర్ పనులు నిలిపివేయాలని వినతి

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్ కాలనీలో నింబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న జియో సెల్ టవర్ పనులను నిలిపివేయాలని కోరుతూ కాలనీవాసులు గురువారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలోని పిఎస్ క్లాసిక్ అపార్టుమెంట్ నిర్వాహకులు డబ్బుల ఆశతో సెల్‌టవర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. సెల్ టవర్ రేడియేషన్ కారణంగా కాలనీవాసులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని టవర్ ఏర్పాటును నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంస్కృతి ఇతర అపార్టుమెంట్లకు సోకితే కాలనీ టవర్‌లతో నిండిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బ్రహ్మాచారి, బాలరాజు, శ్రీపాద మల్లేష్, స్వయం ప్రకాశ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మొండిచెయ్యి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. గురువారం జీహెచ్ఎంసీ ఛీఫ్ ఇంజినీరింగ్ దేవానంద్‌ను కలిసి సఫిల్‌గూడ వద్ద ఎల్‌హెచ్ఎస్ (లో హైట్ సెక్షన్) టన్నెల్ నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ సఫిల్‌గూడ వద్ద రైల్వే లెవెల్ క్రాసింగ్ తొలగించడానికి వ్యతిరేకం కాదన్నారు. శాశ్వతంగా మూసివేయడంతో ఆనంద్‌బాగ్ మీదుగా ఉత్తంనగర్ ఆర్‌యూబీ మార్గంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిందన్నారు. అన్ విల్లింగ్ లెటర్ పెండింగ్‌లో ఉందని తెలియజేయడంతో సెక్రటరేట్‌లో ఎంఎయూడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్‌ను కలిసి త్వరితగతిన లెటర్ ఇవ్వాలని కోరామన్నారు. వాజుపేయినగర్ వద్ద కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణానికి అనుకూలంగా లేదని ఆర్అండ్‌బి విభాగం లెటర్ అందజేశారన్నారు. ఆర్‌యూబీల నిర్మాణం కోసం గతంలో పలుమార్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లామని, మళ్లీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, హిస్టరీ, రాజనీతి శాస్త్రం, గణిత శాస్త్రం సబ్జెక్టుల్లో అర్హత గల అభ్యర్థులు జులై ఒటవ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని, రెండవ తేదీనా తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉప్పల్ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాంతం, నీట్/సెట్/ పిహెచ్‌డి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు డా. జి. తిరుపతయ్య 9059823318ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. రామంతాపూర్ శ్రీనివాసపురం ప్రాంతానికి చెందిన మండల దినేష్ కుమార్ (36) మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గురువారం విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా రామంతాపూర్ హీరో హోండా షోరూం వద్దకు చేరుకోగానే లారీ టిఎస్12- యుఈ-2276ని వెనుక నుంచి దినేష్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. దీంతో దినేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.